క్లుప్తంగా

నేడు మంత్రి రాజా పర్యటన

కోటనందూరు: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా శనివారం కోటనందూరు మండలంలో పర్యటిస్తారని ఎంపీపీ లగుడు శ్రీనివాసు శుక్రవారం తెలిపారు. సాయంత్రం 4.30 గంటలకు బొద్దవరంలో నూతనంగా నిర్మించిన ఎస్సీ కమ్యూనిటీ హాలు, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను మంత్రి ప్రారంభింస్తారన్నారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని ఆయా కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు.

ఉచిత కంటి వైద్య శిబిరం



రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న డాక్టర్

తుని: స్థానిక కొత్తపేట సత్యసాయి మందిరంలో వాకర్స్ హెల్త్ క్లబ్, కిరణ్మయి కంటి ఆసుపత్రి సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్ పర్యవేక్షణలో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరాన్ని వాకర్స్ హెల్త్ క్లబ్ గౌరవాధ్యక్షుడు కలిదిండి సత్యనారాయణరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా సంస్థ జిల్లా గవర్నర్ చదరం శివాజీ మాట్లాడుతూ వాకర్స్ ఆరోగ్య పరిరక్షణలో భాగంగా తరచూ వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కంటిలో శుక్లాలు ఉన్న వారికి విశాఖపట్నంలోని శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ జిల్లా కార్యదర్శి కుందెం సత్యనారాయణ, అధ్యక్షుడు డీఎస్ మూర్తి, ప్రతినిధులు కందవల్లి జోసెఫ్, పర్వత బాబూరావు, కొమ్మోజు గౌరీశంకర్, నెల్లిపూడి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్: ఏలేశ్వరం మండలం సిరిపురం గ్రామానికి చెందిన మనం సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం పేదలకు దుప్పట్లు, పండ్లు పంపిణీ చేశారు. మనం సేవా ఫౌండేషన్ చైర్మన్ మానురి లత ఆధ్వర్యంలో హైవేపై ప్రత్తిపాడు నుంచి అన్నవరం వరకూ గల యాచకులు, పేదలకు దుస్తులు, భోజనం, ఫ్రూట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. పలు గ్రామాల్లో అభాగ్యులను గుర్తించి దుప్పట్లు పంపిణీ చేసినట్లు చైర్మన్ లత తెలిపారు

అన్నసమారాధన

రౌతులపూడి: మండలంలోని బలరామపురం పాదాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద శుక్రవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నదానం చేశారు. స్థానిక, పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు



రమణ (ఫైల్)

కిర్లంపూడి: వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు స్థానిక ఏఎస్సై బీఎస్వీఎన్ కుమార్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే...మండలంలోని చిల్లంగి గ్రామానికి చెందిన రమణకు 2017లో వీరవరం గ్రామానికి చెందిన బీడీల పసుపులమ్మతో వివాహం జరిగింది. రమణ తాపీ పని చేసుకుంటూ వీరవరంలోనే కుటుంబంతో జీవనం సాగిస్తున్నాడు. రమణ కొంత కాలంగా ప్రతిరోజూ మద్యం తాగి ఇంటికి రావటంతో భార్య మందలించింది. దీంతో ఈ నెల 3న ఇంటి నుంచి బయటకు వెళ్లిన రమణ ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో గాలించారు. అయినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో అతని భార్య పసుపులమ్మ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఏఎస్సై కుమార్ తెలిపారు.

ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల నిరసన

ప్రత్తిపాడు: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీఎన్జీఓ ఆధ్వర్యాన ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సభ్యులు శుక్రవారం ప్రత్తిపాడులో ఆందోళన చేశారు. భోజన విరామ సమయంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్ల బ్యాడ్జీలు ధరించి ధర్నా చేపట్టారు. పీఆర్సీ, డీఏ పాత బకాయిలు చెల్లించాలని, సీపీఎస్ రద్దు చేసి, ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, కొత్త పీఆర్సీని తక్షణమే ప్రకటించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు తాలూకా ఎన్జీఓ సంఘ ప్రధాన కార్యదర్శి ఎంఎన్ సత్యనారాయణ, సురేష్‌కుమార్, సమీర్, యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాసరావు, డి.రాజబాబు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

జగ్గంపేట: మండలంలోని ఇర్రిపాకలో ఏలేరు నది ఒడ్డున వేంచేసిన మల్లికార్జునస్వామి ఆలయంలో వచ్చే నెల 7న కోటి లింగాలతో మహాకుంభాభిషేకం, స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. ఇర్రిపాకలో మహాకుంభాభిషేకం వాల్‌పోస్టర్‌ను శుక్రువారం ఆయన ఆవిష్కరించారు. మహాకుంభాభిషేకంలో భాగంగా శృంగేరి పీఠాధిపతుల ఆశీస్సులతో ఈ నెల 26 నుంచి మార్చి 7వ తేదీ వరకూ 11 రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



రాజారంలో ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు
- పలు గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం



సి.రాయవరంలో గడపగడపకూ మన ప్రభుత్వం నిర్వహిస్తున్న వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని సి.రాయవరంలో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులతో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గత ఐదేళ్లలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వరుపుల మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నేతలు గుమ్ములూరి వెంకటరమణ, యిజనగిరి శివప్రసాద్, అడపా పార్థసారథి, పసల నాగేశ్వరరావు, రామిశెట్టి వెంకటరమణ, అల్లం ఆదినారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యం

శంఖవరం: పేదలను ఆర్థికంగా బలోపేతం చేయడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పని చేస్తున్నారని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు అన్నారు. మండలంలోని గౌరంపేట, గొంది, రాజారం, మాసంపల్లి, ఎం.జగన్నాథపురం గ్రామాల్లో శుక్రవారం ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎంపీపీ పర్వత రాజుబాబు, పార్టీ నేతలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ నరాల శ్రీను, సర్పంచులు ఈగల విజయదుర్గ, సకురు గుర్రాజు, మాదాసు దొంబాబు, ఎంపీటీసీలు చప్పా రాంబాబు, ఎం.సత్యప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు మాదాసు ప్రసాద్, గుండ్రాజు బాబులు, పాకల రాజు, గింజాల కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం



మల్లేపల్లి ఆత్మీయ సమావేశంలో తోట నరసింహాన్ని సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం
- మల్లేపల్లిలో ఆత్మీయ సమావేశం

గండేపల్లి: ప్రజాసంక్షేమం, అభివృద్ధి నిరాటకంగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని మల్లేపల్లిలో వైఎస్సార్ సీపీ నాయకులతో ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ చలగళ్ల దొరబాబు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పేదల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో కులమతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి బటన్ నొక్కగానే నేరుగా లబ్ధిదారుల ఖాతాలకు సొమ్ములు జమవుతున్నాయన్నారు. గతంలో ఏ ప్రభుత్వంలో ప్రజా సంక్షేమానికి ఇంత ప్రాధాన్యం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వం ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ఆరోపణలను నమ్మొద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ యువనేత తోట రాంజీ, పార్టీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ, జేసీఎస్ మండల కన్వీనర్ తాళ్లూరి మధు, పార్టీ సీనియర్ నాయకులు అత్తులూరి సాయిబాబు, ఉప్పలపాడు సొసైటీ అధ్యక్షుడు పాము సూరిబాబు, సర్పంచులు పోకల సుబ్బు, బొబ్బర శివ, డీసీఎంఎస్ మాజీ డైరెక్టర్ రామకుర్తి మూర్తి, మాజీ సర్పంచ్ కుంచే చినబాబు, నాయకులు తులా రాము, పరిమి వెంకటేశ్వరరావు, సాంస్కృతిక విభాగం జిల్లా అధ్యక్షుడు బేకరి బాబు, మాజీ జెడ్పీటీసీ బిత్రా గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ రోడ్డు మార్గాన రావచ్చు

గోకవరం: జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ భీమవరం రావాలనుకుంటే రోడ్డు మార్గాన రావచ్చునని, తప్పించుకునేందుకు ప్రభుత్వంపై బురద చల్లాల్సిన అవసరం లేదని జగ్గంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. మండలంలోని శుక్రవారం గోకవరంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ప్రతిపక్ష పార్టీలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

- ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ



రాచపల్లి అరుణాచల క్షేత్రంలో ప్రవచనం చేస్తున్న సామవేదం షణ్ముఖశర్మ

ప్రత్తిపాడు రూరల్: ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త సామవేదం షణ్ముఖశర్మ అన్నారు. రథ సప్తమిని పురస్కరించుకుని మండలంలోని రాచపల్లి అపిత కుచాంబ సమేత అరుణాచలేశ్వరస్వామి దేవస్థానాన్ని శుక్రవారం సాయంత్రం ఆయన సందర్శించారు. శ్రీరమణా సేవాశ్రమం పీఠాధిపతి స్వామి రామానంద ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. షణ్ముఖ శర్మ ఆలయాన్ని, ఆలయ పరిసరాలను పరిశీలించి ఆలయం విశిష్టతను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన భక్తులను ఉద్దేశించి అనుగ్రహభాషణం చేశారు. రమణ తత్వాన్ని ఆచరించడం ద్వారా మనసులో భగవంతుడిని దర్శించవచ్చన్నారు. ఏకాంతం, మౌనం, ధ్యానంతో రమణ మహర్షి సాధన చేశారని తెలిపారు. పరిసర గ్రామాల భక్తులు షణ్ముఖ శర్మ కలిసి ఆశీర్వచనాలు పొందారు.

కల్యాణం... కమనీయం



గజ్జనపూడిలో స్వామి, అమ్మవార్లకు పవిత్ర స్నానం చేయిస్తున్న పండితులు, భక్తులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని గజ్జనపూడిలో శుక్రవారం భావనఋషి భద్రావతీదేవి అమ్మవార్ల కల్యాణం కన్నులపండువగా జరిగింది. తొలుత ఆలయ పండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణం జరిపారు.గజ్జనపూడి, శరభవరం తదితర గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. పరిసర గ్రామాల భక్తులు పాల్గొని అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



ముక్కొల్లులో లక్ష్మీదేవి అమ్మవారిని దర్శించుకుంటున్న తోట రాంజీ

కిర్లంపూడి: మండలంలోని ముక్కొల్లులో లక్ష్మీదేవి ఆలయ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. వైఎస్సార్ సీపీ యువ నాయకుడు తోట రాంజీ, పార్టీ మండల ఇన్‌చార్జి తోట బాబ్జీ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద భారీ అన్నసమారాధన నిర్వహించారు. స్థానిక, పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అన్నప్రసాదం స్వీకరించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

లోక్ అదాలత్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న జడ్జి బాలకోటేశ్వరరావు

తుని: వచ్చే నెల 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని స్థానిక కోర్టు జడ్జి, న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ కె.బాలకోటేశ్వరరావు కోరారు. స్థానిక కోర్టు ఆవరణలో శుక్రవారం న్యాయవాదులు, పోలీసు అధికారులతో ఆయన వేరువేరుగా సమావేశాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కక్షిదారులతో చర్చించాలన్నారు. గ్రామాల్లోని చిన్న కేసులను రాజీ మార్గంలోనే పరిష్కరించుకోవాలన్నారు. లోక్ అదాలత్ వలన కలిగే ప్రయోజనాలు వారికి వివరించాలని సూచించారు. కార్యక్రమంలో సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడురూరల్/ప్రత్తిపాడు: మండలంలోని ప్రైవేటు పాఠశాలల్లో పేద పిల్లలకు ప్రభుత్వం ఉచిత విద్యను అందిస్తోందని, ఆసక్తి గలవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ వి.రాజబాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథ, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ వర్గాలకు చెందిన పిల్లలు అర్హులని పేర్కొన్నారు. ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం కోటా కింద ఆయా వర్గాల పిల్లలు ప్రవేశాలు పొందవచ్చన్నారు. దరఖాస్తు చేసుకునేందుకు వచ్చే నెల 14 వరకూ గడువు ఉందని చెప్పారు.

విద్యా సంస్థల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

తుని రూరల్: విద్యాహక్కు చట్టం ప్రకారం 2024–25 విద్యా సంవత్సరానికి అన్ని ప్రైవేట్, ఎయిడెడ్ సంస్థల్లో ఒకటో తరగతిలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి పరవాడ గీతాదేవి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథలు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, విభిన్న ప్రతిభవంతులు, ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ, ఇతర పిల్లలు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. అర్హులకు ఆయా పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయిస్తారని తెలిపారు.

కిర్లంపూడి/గండేపల్లి: నియోజకవర్గంలో ప్రతికూల పరిస్థితులు ఎదుర్కొంటున్న కుటుంబాలల్లోని పిల్లలు ప్రైవేటు పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓలు ఎంఈఓలు టి.జోసెఫ్, ఎం.చిన్నారావు సూచించారు. విద్యాహక్కు చట్టం ప్రకారం అనాథ, హెచ్ఐవీ బాధితులు, విభిన్న ప్రతిభావంతులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ కేటగిరీలకు చెందిన పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయిస్తారని తెలిపారు. ఆసక్తి గల పిల్లలు వచ్చే నెల 14వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఉచిత సీట్లకు దరఖాస్తు చేసుకోవాలి

తొండంగి: ప్రైవేటు పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరంలో ప్రవేశానికి అర్హులైన పేద విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి షేక్‌బాబ్జీ సూచించారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ విద్యాసంస్థలో పేదలకు 25 శాతం సీట్లను కేటాయించాల్సి ఉందన్నారు. అనాథ పిల్లలు, విభిన్న ప్రతిభావంతులు, హెచ్ఐవీ బాధితులు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలకు చెందిన పిల్లలు అర్హులన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈ నెల 23 నుంచి మార్చి 14 వరకూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

పార్టీ విజయానికి కృషి చేస్తాం



కాకినాడ పార్టీ కార్యాలయంలో సునీల్ కలిసి మద్దతు తెలుపుతున్న గూడుపు ఆదినారాయణ, తదితరులు

కిర్లంపూడి: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని గూడుపు ఆదినారాయణ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం సుమారు 50 మంది పార్టీ అభిమానులు బైక్ ర్యాలీగా కాకినాడ వైఎస్సార్ సీపీ కార్యాలయానికి చేరుకుని పార్టీ కాకినాడ పార్లమెంటరీ ఇన్‌చార్జి చలమలశెట్టి సునీల్‌కు మద్దతు తెలిపారు. సునీల్ వారిని ఆహ్వానించి, శక్తి వంచన లేకుండా పార్టీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు.

విపత్తులపై అవగాహన

గోకవరం: గుమ్మలదొడ్డిలోని ఐటీసీఎల్‌లో శుక్రవారం విపత్తులపై అవగాహన సదస్సు నిర్వహించారు. పదో బెటాలియన్ ఎన్‌డీఆర్ఎఫ్ ఆధ్వర్యంలో హెచ్‌పీసీఎల్ వీవీఎస్పీల్ ఆర్బీఎస్ పైప్‌లైన్ లీక్‌పై మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ హేమకుమారి, కాకినాడ డీసీఐఎఫ్ డి.రాధాకృష్ణ, ఫైర్ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్యవివాహాల నివారణకు చర్యలు



ప్రత్తిపాడు సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీనివాసరావు

జగ్గంపేట: బాల్య వివాహాలు నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని జగ్గంపేట ఐసీడీఎస్ సీడీపీఓ పూర్ణిమ తెలిపారు. స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం వీఓఎస్‌లు, వీఏఎస్‌లకు బాల్య వివాహాల నివారణ, బాలబాలికల హక్కులు, చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. గ్రామాల్లో ఎక్కడైనా బాల్యవివాహాలు జరిగితే తక్షణమే టోల్ ఫ్రీ నంబర్ 1098కి కాల్ చేసి సమాచారం అందించాలని కోరారు. బాల్య వివాహాల నిర్మూలనకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నట్లు తెలిపారు. బాల్య వివాహాలు చేసిన వారికి రూ.లక్ష జరిమానాతో పాటు 2 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తారన్నారు. పిల్లలు లేని తల్లిదండ్రులు పిల్లలను దత్తత తీసుకోవాలని భావిస్తే ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహాలను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, బి.దుర్గారాణి, డీఆర్‌డీఏ ఏపీఎం జగదీశ్వరి, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ జి.సునీత, ఎస్.అమ్మాజీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రత్తిపాడు: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ ప్రొటెక్షన్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో జిల్లా స్త్రీ, శిశు అభివృద్ధి సంస్థ, డీఆర్‌డీఏ సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన చట్టాలు, బాల బాలికల హక్కులు–చట్టాలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల, గ్రామ స్థాయిలో బాల్య వివాహ నిర్మూలనకు అధికారులను నియమించామన్నారు.గుడ్ టచ్, బ్యాడ్ టచ్, వేధింపులకు గురయ్యే బాలికల లక్షణాలు, పౌష్టికాహారం తదితర అంశాలపై వివరించారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య కార్యదర్శి స్వప్న, సీసీలు, కాంతిపథం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలి

ఏలేశ్వరం: ప్రజా సమస్యలను అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి సూచించారు. మండలంలోని యర్రవరంలో గ్రామ సచివాలయాలు, విద్యుత్ ఉపకేంద్రాన్ని శుక్రవారం ఎంపీపీ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయాల్లో వచ్చే సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారించాలన్నారు. ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలన్నారు. అనంతరం సచివాలయంలో రికార్డులు తనిఖీ చేశారు. వచ్చే వేసవిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ సిబ్బందికి సూచించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా విద్యుత్ సరాఫరా చేయాలన్నారు. సచివాలయ, విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం


అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. పండితులు ఉదయం 9 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమద్రవ్యాలు సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ప్రయాగ రాంబాబు, వంశీ, ఫణిశర్మ, చల్లపిల్ల ప్రసాద్, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం నిర్వహించారు. మొత్తం 40 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన


ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండ దిగువన కనకదుర్గ అమ్మవారికి అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ రుత్విక్కులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.

వైభవంగా రథసప్తమి వేడుకలు

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు



రత్నగిరిపై సూర్యనమస్కారాలు చేస్తున్న పండితులు



ఏలేశ్వరం రామాలయంలో భక్తిపాటలు ఆలపిస్తున్న మహిళలు

ఏలేశ్వరం: రథసప్తమి వేడుకలు శుక్రవారం ప్రత్తిపాడు, తుని, జగ్గంపేట నియోజకవర్గాల్లో వైభవంగా జరిగాయి. ప్రత్యక్షదైవమైన సూర్యనారాయణమూర్తికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి ఆలయాలకు భక్తులు పోటెత్తారు. మహిళలు ఏరుపిడకల పొయ్యిపై ప్రసాదం తయారు చేసి స్వామివారికి నివేదించారు. చిక్కుడు కాయలతో రథాలు చేసి పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో పండితులు సూర్యభగవానుడికి వివిధ భంగిమల్లో సూర్యనమస్కారాలు సమర్పించారు. మండలంలోని పెద్దనాపల్లి సూర్యనారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి స్వామివారి దర్శించుకున్నారు. ఏలేశ్వరం పట్టణంలోని శివాలయం, సత్యనారాయణస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఆలయాల్లో మహిళలు భక్తిపాటలు ఆలపించారు.

గండేపల్లి: మండల వ్యాప్తంగా శుక్రవారం రథసప్తమి వేడుకలు వైభవంగా జరిగాయి. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయాలకు పోటెత్తారు. పలు ఆలయాల్లో సూర్యనమస్కారాలు నిర్వహించారు. మహిళలు ఆవుపిడకల పొయ్యిపై క్షీరాన్నం తయారు చేసి సూర్యనారాయణమూర్తికి నైవేద్యం సమర్పించారు. తాళ్లూరు శివాలయంలో సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రత్నగిరిపై ఘనంగా రథసప్తమి వేడుకలు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని సన్నిధిలో రథసప్తమి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పండుతులు సత్యదేవుని వార్షిక కల్యాణ వేదిక మీద సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు, వివిధ భంగిమల్లో నమస్కారాలు చేశారు. దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్ సూర్యభగవానుడికి నూతన వస్త్రాలను సమర్పించారు. వేద పండితులు ఉదయం 7.30 గంటల నుంచి 11–30 గంటల వరకు సూర్యనమస్కారాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు సమర్పించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేద పండితులు గంగాధరబట్ల గంగబాబు, చిట్టి శివ, యనమండ్ర శర్మ ఘనపాఠి, ఇంద్రగంటి నర్సింహమూర్తి, కోట సుబ్రహ్మణ్యం, కల్యాణ బ్రహ్మ ఛామర్తి కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ధర్నా



తుని జాతీయరహదారిపై ఆందోళన చేస్తున్న వాహనాల డ్రైవర్లు

ఏలేశ్వరం/ప్రత్తిపాడు: కేంద్ర ప్రభుత్వం ప్రజా, రైతు, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాలని కోరుతూ శుక్రవారం ఏలేశ్వరం పట్టణం, ప్రత్తిపాడులో ధర్నా నిర్వహించారు. దేశవ్యాప్త బంద్‌లో భాగంగా సీఐటీయూ, క్వారీ లారీ యూనియన్ వర్కర్స్ ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ చేసి తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. జాతీయ రహదారిపై యర్రవరం వద్ద రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల నాయకుడు పాకలపాటి సోమరాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజావ్యతిరేక విధానాలను విరమించుకోవాలన్నారు. ట్రాన్స్ పోర్ట్ ఆపరేటర్లకు అన్యాయం చేసే చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కేంద్రం ప్రభుత్వం వైఖరి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో గండేటి వేణు, కూసి వసంతకుమార్, దొండపాటి నాగేశ్వరరావు, వాకాడ కనకరాజు, గొర్లె శివ తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులు చేయడం అన్యాయం

తుని: అనుకోకుండా జరిగే ప్రమాదాలకు డ్రైవర్లను బాధ్యులు చేస్తూ హిట్ అండ్ రన్ చట్టాన్ని అమల్లోకి తీసుకురావడం అన్యాయమని లారీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రఘురాంచంద్రరాజు, గూడ్స్ యూనియన్ నాయకులు సత్తిబాబు, సీఐటీయూ నాయకులు శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ ఫెడరేషన్ పిలుపు మేరకు శుక్రవారం తుని పట్టణంలో డ్రైవర్లు రోడ్లపై బైఠాయించి నిరసన తెలిపారు. హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో వాహన యూనియన్ నాయకులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

జగ్గంపేట: కేంద్ర ప్రభుత్వం తీరుకు నిరసనగా జగ్గంపేటలో భారత కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో బంద్ నిర్వహించారు. ఐఎఫ్‌టీయూ, అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో స్థానిక స్టాలిన్ భవనం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకూ ర్యాలీ చేశారు. బస్టాండ్ వద్ద మానవహారంగా ఏర్పడి కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు.